కంపు.. కంపు!

- అధ్వానంగా మదనపల్లె మార్కెట్
- ఎక్కడపడితే అక్కడ రాసుల్లా టమాటాలు
- పట్టించుకోని అధికారులు
- అవస్థలు పడుతున్న రైతులు, వినియోగదారులు


మార్కెట్‌లో పేరుకుపోయిన వ్యర్థాలు, ప్లాస్టిక్



మదనపల్లె మార్కెట్‌లో మండి వద్దే పారబోసిన టమాటాలు

మదనపల్లె : ఆసియాలోనే అతిపెద్దదైన మదనపల్లె టమాటా మార్కెట్ కంపు కొడుతోంది. వ్యాపారులు, రైతులు ముక్కు మూసుకోవాల్సి వస్తోంది. మదనపల్లె, తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాలకు చెందిన రైతులు పండించిన టమాటాను విక్రయించుకునేందుకు ఇక్కడికి తరలిస్తారు. ఇక్కడ కొనుగోలు చేసిన టమాటాను వ్యాపారులు దేశవ్యాప్తంగా ఎగుమతులు చేస్తారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ మార్కెట్ నిర్వహణ విషయంలో మార్కెటింగ్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం అడుగడుగునా కనిపిస్తుంది. మార్కెట్‌లో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితులను చక్కదిద్దడంలో విఫలమైన అధికారులు కనీసం పారిశుద్ధ్య పనులను చేపట్టడంలో పూర్తిగా విఫలమయ్యారు. దీనితో కంపుకొడుతూ మార్కెట్ నుంచి ఎప్పుడు బయటపడతామని అన్నట్టుంది ప్రస్తుత పరిస్థితి.

ఎక్కడపడితే అక్కడ పారబోత

మదనపల్లె మార్కెట్‌కు వందల టన్నుల టమాటా విక్రయానికి వస్తాయి. ఇందులో వ్యాపారులు తాము కొనుగోలు చేయని టమాటాను వదిలేస్తారు. దీంతో రైతులు, వ్యాపారులు వీటిని ఎక్కడైనా తరలించి పారబోయాలి. అయితే వీటిని తమ మండీల పక్కన, మార్కెట్‌లోని రోడ్లపైన పారబోస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇవి రెండుమూడురోజుల తర్వాత కుళ్లి దుర్వాసన వస్తున్నా వ్యాపారులు, రైతులు తమ కార్యకలాపాలను కొనసాగించుకుంటూనే ఉంటారు. ఇక్కడ నిలబడాలంటే భరించలేదని దుర్వాసన అయినా దీన్ని పట్టించుకునే మార్కెట్ అధికారులు లేరు. దీనికి తోడు ప్లాస్టిక్, వ్యాపారులు, రైతులు వినియోగించి వ్యర్థాలతో మార్కెట్ నిండిపోతోంది. పరిశుభ్రంగా ఉంచాల్సిన మార్కెట్‌పై పూర్తి నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. మార్కెట్ రోడ్లపైన, మండీల పక్కన ఇవి కుప్పల్లా కనిపిస్తున్నాయి. వీటిని తొలగించాలన్న కనీస చొరవ తీసుకోకపోవడం చూస్తే అధికారుల నిర్లక్ష్యం కొట్టుకొచ్చినట్టు స్పష్టంగా కనిపిస్తోంది.

నిధులు ఏమవుతున్నాయి?

మార్కెట్ కమిటీకి వచ్చే ఆదాయంలో ఏటా బడ్జెట్‌లో పారిశుద్ధ్య పనుల కోసం రూ.లక్షల్లో నిధులు కేటాయిస్తారు. ఈ నిధులు మార్కెట్ కమిటీ నిధుల నుంచి కేటాయించి సద్వినియోగం చేసుకునే వెసులుబాటు ఉంది. అయితే మదనపల్లె మార్కెట్ ఆదాయం కోట్లలో ఉండటం, అతిపెద్ద మార్కెట్ కావడంతో ఇక్కడ నిధులు అత్యధికంగా పారిశుద్ధ్య కోసం కేటాయించడం జరుగుతుంది. అయితే నిధులు సద్వినియోగం చేస్తున్నారా లేదా అనేది రహస్యం అయినప్పటికి మార్కెట్‌లో పారిశుద్ధ్యం పరిస్థితులు చూస్తుంటే నిధులు ఖర్చు చేస్తున్నట్టుగా కనిపించడం లేదు. దీనితో నిధులు ఖర్చు చేస్తున్నట్టు లెక్కల్లో చూపించుకుంటున్నారా అన్న అనుమానాలు లేకపోలేదు. దీనిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.

క్లుప్తంగా

ఘనంగా శయనోత్సవం


పుష్పాలంకరణలో సతీసమేతంగా లక్ష్మీనరసింహస్వామి

కలికిరి: పట్టణంలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల అనంతరం లోప దోషాల నివృత్తి నివారణ నిమిత్తం ఆనవాయితీ ప్రకారం స్వామి, అమ్మవార్లకు గురువారం పుష్పయాగం, శయనోత్సవం ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో గోవింద నామస్మరణ మధ్య స్వామివారికి పుష్పయాగం చేశారు. ఆలయ అర్చకులు మురళీధరాచార్యులు, శ్రీకాంతాచార్యులు, రాముస్వామి పాల్గొన్నారు.

హౌసింగ్ పీడీ తనిఖీ


విచారిస్తున్న హౌసింగ్ పీడీ

పెద్దతిప్పసముద్రం: అన్నమయ్య జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ సాంబ శివయ్య గురువారం మండలంలోని కమ్మచెరువు పంచాయతీలో పక్కా గృహ నిర్మాణాలను తనిఖీ చేశారు. అదే విధంగా కమ్మచెరువుకు చెందిన పసుపులేటి శంకరమ్మ అనే మహిళ తాను పక్కాగృహం నిర్మించినా ప్రభుత్వం ద్వారా ఇంకా ఎలాంటి బిల్లులు మంజూరు కాలేదని ఇటీవల పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. కలెక్టర్ ఆదేశాల మేరకు పీడీ సదరు బాధితురాలి గృహాన్ని సందర్శించి చర్చించారు. అయితే బాధిత మహిళ గృహం ఇంకా మంజూరు దశలోనే ఉందని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాకా బిల్లులు అందజేస్తామని పీడీ తెలిపారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా రమాదేవి

రామసముద్రం: రామసముద్రం మండలం ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా రమాదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న చంద్రకాంత తంబళ్లపల్లి మండలానికి బదిలీ కావడంతో పుంగనూరు ఐసీడీఎస్ పరిధిలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న రమాదేవి రామసముద్రంకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణీలకు, బాలింతలకు, పిల్లలకు సకాలంలో పౌష్టికాహారం, ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వినియోగదారుల మనసు గెలవాలి


మాట్లాడుతున్న ఆదిత్య

కురబలకోట : నేటి పోటీ ప్రపంచంలో వ్యాపార రంగంలో విజయం సాధించాలంటే నాణ్యమైన ఉత్పత్తులు, సేవలే కాకుండా ముఖ్యంగా వినియోగదారుల మనసు గెలవాలని బెంగళూరు ఎత్నుస్ కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజర్, హెచ్ఆర్ బి. ఆదిత్య అన్నారు. అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం జరిగిన ఎక్స్‌లెన్స్ 2కె25 కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ కస్టమర్ల అవసరాలు, అభిరుచులకు అనుగుణంగా ఉత్పత్తులు ఉండాలన్నారు. అప్పుడు కస్టమర్లతో దీర్ఘకాలిక సంబంధాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. కస్టమర్‌తో సంబంధాలు, నాణ్యత, నమ్మకంతో పాటు సంతృప్తి విజయానికి వంతెనలాంటిదని వ్యాఖ్యానించారు. మార్కెటింగ్, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, ప్రభుత్వ రంగం, ఇన్సూరెన్సూ తదితర రంగాల్లో ఎంబీఏ అభ్యర్థుల అవసరం, ఆవశ్యకత ఉందన్నారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

వధూవరులకు ఆశీర్వాదం


వివాహ వేడుకలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్

మదనపల్లె రూరల్ : వైఎస్సార్‌సీపీ నాయకులకు చెందిన వివాహ వేడుకలో నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోట మండలం సందిరెడ్డిగారిపల్లెకు చెందిన పఠాన్‌ముబారక్ ఆత్మీయ ఆహ్వానం మేరకు... అంగళ్లు భారత్ కల్యాణమండపంలో జరిగిన పఠాన్ హారూన్ రషీద్ వివాహ వేడుకలకు నిసార్‌అహ్మద్ హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను, నిసార్‌అహ్మద్ పేరుపేరునా పలకరించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మదార్‌సాబ్, మురాషాసాబ్, ఖాదర్, బాషాసాబ్, యూనస్, జబీవుల్లా, యాసిన్, అబ్దుల్లా, ఖిజర్‌ఖాన్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏడాది పాలన అరాచకం, విధ్వంసం, మోసం

నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ ధ్వజం



మదనపల్లె రూరల్ : మూడుపార్టీలను కలుపుకుని అధికారంలోకి వచ్చిన కూటమిప్రభుత్వం ఏడాది పాలన మొత్తం అరాచకం, విధ్వంసం, మోసంతో పూర్తయిందని నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ ధ్వజమెత్తారు. గురువారం కూటమి ఏడాది పాలనపై ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏడాది చంద్రబాబు పాలనలో ప్రజలకు మిగిలింది వంచన, దగా, కుట్రలు మాత్రమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్‌సిక్స్ హామీల పేరుతో ప్రజలను దగాచేసి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు...వాటిని అమలుచేయకుండానే ఏడాది గడిపేశారన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో రాష్ట్రంలో అరాచకాలు సృష్టిస్తూ, మహిళలకు, చిన్నారులపై దాడులు, అఘాయిత్యాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే వారిపై అక్రమ కేసులు బనాయించడమే కాకుండా ప్రశ్నించే గొంతులను నొక్కేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన అంటే ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి గుర్తుకువస్తే...ఇప్పుడు చంద్రబాబు పాలనలో ఆయన ప్రజలకు పొడిచిన వెన్నుపోటు గుర్తుకువస్తోందని ఎద్దేవా చేశారు. సాక్షి మీడియా గొంతునొక్కాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు కుట్రచేస్తున్నారని మండిపడ్డారు. అందులో భాగంగానే సాక్షి కార్యాలయాలపై దాడులు చేయించడంతో పాటు, సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావుపై తప్పుడు కేసులు బనాయించి అరెస్ట్ చేశారని తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలు బయటపడిపోతాయనే భయంతోనే అక్రమ అరెస్ట్‌లతో డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారన్నారు. జగన్ పాలన రాష్ట్ర ప్రజలకు స్వర్ణయుగం అయితే, బాబు ఏడాదిపాలన చీకటిమయం అన్నారు. ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోందన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా సంక్షేమ ప్రదాత జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్న కసితో ప్రజలు ఉన్నారని పేర్కొన్నారు. కూటమిప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజాక్షేత్రంలో ఎండగడుతూ, ప్రజలకు అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

సెక్యూరిటీ గార్డుపై దాడి అమానుషం

పీలేరు రూరల్: సెక్యూరిటీగార్డుపై దాడిచేయడం అమానుషమని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు యమలా సుదర్శన్ అన్నారు. గురువారం పీలేరులో ఆయన మాట్లాడుతూ పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో సెక్యూరిటీగార్డుగా విధులు నిర్వహిస్తున్న ధరణికుమార్‌పై బుధవారం దాడికి పాల్పడిన మహేష్‌పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసును మోదు చేయాలని డిమాండ్ చేశారు.

ధరణికుమార్‌పై ఫిర్యాదు

మరోవైపు ధరణికుమార్‌పై మహేష్ భార్య రజనీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తమ హోటల్, మాంసం దుకాణంలోని వస్తువులను ధ్వంసం చేశారని, దీంతో రూ. 4లక్షల వరకూ నష్టం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

మదనపల్లె రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామని తహసీల్దార్ కే.కిషోర్‌కుమార్ రెడ్డి అన్నారు. తహసీల్దార్‌గా కే.కిషోర్‌కుమార్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. తహసీల్దార్ల సాధారణ బదిలీల్లో భాగంగా మదనపల్లెలో పనిచేస్తున్న ధనంజయులు కురబలకోటకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వైఎస్సార్ కడపజిల్లా వీ.ఎన్.పల్లెలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న కిషోర్‌కుమార్‌రెడ్డిని మదనపల్లె తహసీల్దార్‌గా పదోన్నతిపై బదిలీ చేశారు.

బి.కొత్తకోట : బి.కొత్తకోట తహసీల్దార్‌గా బావాజాన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న మహమ్మద్ అజారుద్దీన్ రామసముద్రంకు బదిలీ అయ్యారు.

విశాఖ ఉక్కుపై కూటమి ప్రభుత్వం మోసం


మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

మదనపల్లె: విశాఖ ఉక్కును కాపాడుతామని, ఉద్యోగుల హక్కులకు రక్షణగా నిలుస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం నిలువునా మోసం చేసిందని ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు విమర్శించారు. దీనికి నిరసనగా గురువారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. విశాఖ ఉక్కును కాపాడాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఉక్కు ఉద్యోగుల వేతనాల్లో కోతలు విధిస్తున్నారని, కార్మికులను తొలగిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తొమ్మిది నెలలుగా జీతాలు లేక ఉద్యోగుల కుటుంబాలు వీధిన పడుతున్నాయని అన్నారు. రూ.450 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేసి ఆదుకోవాలన్నారు. కేంద్రం నుంచి రూ.11,450 కోట్ల ప్యాకేజీ తెచ్చామని చెప్పిన కూటమి ప్రభుత్వం అందులో రూ.9,500 కోట్లు రుణాలకు చెల్లిస్తే ఇక అభివృద్ధి ఏముందని ప్రశ్నించారు. 1,125 మంది పర్మినెంట్, 3,500 కాంట్రాక్టు కార్మికులను తొలగించి విశాఖ ఉక్కును నాశనం చేస్తున్నారని అన్నారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలోన ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి సలీంబాషా, జిల్లా కార్యానిర్వాహక అధ్యక్షులు సురేష్‌కుమార్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్, చలపతినాయుడు, ముబారక్, తిరుమల, దేవా, ఇంద్రాణీ, వాసు, చంద్రశేఖర్, నరసింహులు, మల్లికార్జున, నరసమ్మ పాల్గొన్నారు.

ముగిసిన వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్


డ్రోన్‌తో నానో యూరియా పిచికారిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

కలికిరి: కేవీకే ఆధ్వర్యంలో గత నెల 29 నుంచి నిర్వహించిన వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం గురువారంతో ముగిసిందని కేవీకే కో-ఆర్డినేటర్ డా. మంజుల తెలిపారు. కేంద్ర వ్యవసాయశాఖ, రైతు సంక్షేమ శాఖ, భారతీయ వ్యవసాయ మండలి సహకారంతో నిర్వహించిన వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కలికిరి కేవీకే పరిధిలో 15 రోజుల నాటు 45 గ్రామ పంచాయతీలలో కేవీకే శాస్త్రవేత్తలతో పాటు వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధకశాఖ అధికారులతో కలిసి నూతన సాంకేతిక పద్ధతులపై అవగాహన కల్పించారు. శ్రీవెంకటేశ్వర పశువైద్యశాల ప్రొఫెసర్‌లు డాక్టర్ గంగరాజు, డాక్టర్ నవీన్, అనంతరాజుపేట ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ రాజానాయక్, కలికిరి ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్వరాజ్యలక్ష్మీ, కలికిరి ప్రాంతీయ పశువైద్యశాల ఏడీఏ డాక్టర్ వెంకటమునినాయుడు రైతులకు సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం డ్రోన్ ద్వారా నానో యూరియా పిచికారీపై ఇఫ్కో వారి ఆధ్వర్యంలో రైతులకు ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు.

మోగింది బడి గంట


బోధిస్తున్న ఉపాధ్యాయురాలు


పాఠశాల వద్ద విద్యార్థుల సందడి

మదనపల్లె సిటీ: బడి గంట మోగింది.. నిన్న, మొన్నటి వరకు వేసవి సెలవుల్లో ఆట పాటల్లో మునిగి తేలిన విద్యార్థులు గురువారం బడి బాట పట్టారు. దంచికొట్టిన ఎండల నుంచి ఉప శమనం కలిగించేందుకు తమ కోసమేనన్నట్లుగా కురుస్తున్న చిటపట చినుకులతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. మదనపల్లె మున్సిపాలిటీ, మండలాల్లో పాఠశాలల్లో మొదటి రోజు అంతంతమాత్రంగానే వచ్చారు. పాడ్యమి కావడంతో మంచి రోజు చూసుకుని పాఠశాలకు రానున్నారు. మొదటి రోజు కిట్లు పంపిణీ చేయలేదు. మెగా పేరెంట్స్ కమిటీ సమావేశంలో కిట్లు పంపిణీ చేయనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. విద్యార్థులను తల్లిదండ్రులు పాఠశాలకు వద్దకు తీసుకువచ్చి వదిలివెళ్లారు.

ప్రజా సంక్షేమానికి 'కూటమి' తూట్లు


గోపిదిన్నె పర్యటనలో ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి తూట్లు పొడిచిందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి విమర్శించారు. ఏడాదిలోనే కూటమి నాయకులకు ప్రజా వ్యతిరేకత వ్యక్తమవుతోందని తెలిపారు. గురువారం ఆయన గోపిదిన్నె, తంబళ్లపల్లెలో పర్యటించారు. గోపిదిన్నె పంచాయతీ చెరువుముందరపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్దారెడ్డి కుమారుడు శివకుమార్‌రెడ్డి, మంజుల నూతన దంపతులను ఆశీర్వదించారు. అనంతరం గ్రామస్తులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు. గతంలో జగనన్న పాలనలో సంక్షేమం,అభివృద్ధి చెందినట్టు తెలిపారు. జగనన్న పాలనలో అన్ని వర్గాలకు న్యాయం జరిగిందని పేర్కొన్నారు. కూటమి నాయకులు అక్రమాలకు పాల్పడుతూ దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. వారి అక్రమాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి భయపెడుతున్నారని మండిపడ్డారు. కూటమి నాయకుల తాటాకు చప్పుళ్లకు ఎవరూ భయపడే ప్రసక్తే లేదని హెచ్చరించారు. అనంతరం తంబళ్లపల్లె జూనియర్ కాలేజీ సమీపంలో నూతనంగా నిర్మించిన ఎస్ఎల్‌వీ కల్యాణ మండపాన్ని సందర్శించారు. కార్యక్రమాల్లో మండల పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్, నాయకులు నల్లగుడ్ల మల్లికార్జునరెడ్డి, శివారెడ్డి, ఆంజనేయరెడ్డి, గంధర్వరెడ్డి, కుమార్‌రెడ్డి, రఘురామిరెడ్డి, కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

భవితకు అవరోధం బాలకార్మిక వ్యవస్థ


ప్రతిజ్ఞ చేస్తున్న ఫోర్డ్ సంస్థ సిబ్బంది, ప్రజలు

మదనపల్లె సిటీ: బాల కార్మిక వ్యవస్థ ఉండే ఏ ప్రాంతంలోనైనా అక్కడి బాలల భవిష్యత్తుకు అవరోధమని ఫోర్డు సంస్థ డైరెక్టర్ జిల్లా లలితమ్మ అన్నారు. గురువారం ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని అంబేడ్కర్ కాలనీ, వడ్డిపల్లిల్లో ర్యాలీ నిర్వహించారు. బాల్యం బాలల భవితకు పునాదని, చిన్ననాటి నుంచి పిల్లలను పాఠశాలలకు పంపించే అలవాటు చేసుకోవాలన్నారు. డివిజనల్ లేబర్ ఆఫీసర్ ఇర్ఫాన్ హుస్సేన్ మాట్లాడుతూ బాల కార్మికులు లేకుండా పోవాలంటే తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలన్నారు. పిల్లలను పాఠశాలలకు పంపించి, ప్రభుత్వ పథకాలు సద్వియోగం చేసుకోవాలన్నారు. అప్పుడే బాల కార్మిక వ్యవస్థ సమూలంగా రూపుమాపవచ్చునన్నారు. ప్రతి ఒక్కరూ బాల కార్మిక రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలని కోరారు. ఫోర్డు ప్రతినిధులు నిర్మల, సుభాషిణి, స్వర్ణ, జలజ, అల్తాఫ్, జయలక్ష్మి పాల్గొన్నారు.

పెద్దమండ్యం: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఫోర్డ్ సంస్థ మండల కో ఆర్డినేటర్ ఆవుల నరసింహులు కోరారు. మండలంలోని గుర్రంవాండ్లపల్లె పంచాయతీ నక్కలవారికోట, పెద్దమండ్యం పంచాయతీ మిట్టమాలపల్లెల్లో గురువారం బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై కళాజాత నిర్వహించారు. బెంగళూరు క్రై సంస్థ సహకారంతో ఫోర్డ్ సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజులుగా బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మిట్టమాలపల్లె, నక్కలవారికోట పురవీధులలో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పిల్లలకు డ్రాయింగ్, ఆటల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను ఆందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, ఫోర్డ్ సంస్థ సిబ్బంది భువనేశ్వరి, అనిత, రెడ్డెమ్మ, శైలజ, రమణలు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు విత్తనాలు పంపిణీ చేయాలి


రైతులకు వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, అధికారులు

పెద్దమండ్యం: రాయితీ వేరుశనగ విత్తనాలను ప్రతి రైతుకు అందించాలని ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక కోరారు. పెద్దమండ్యం రైతు సేవాకేంద్రంలో గురువారం రాయితీ వేరుశనగ విత్తనాల పంపణీ కార్యక్రమాన్ని ఎంపీపీ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి రైతుకు రాయితీ వేరుశనగ విత్తనాలను అందించాలని అధికారులను కోరారు. మండలంలోని 11 రైతు సేవా కేంద్రాలలో రాయితీ వేరుశెనగ విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు ఏవో తెలిపారు. మండలానికి 1,350 క్వింటాళ్లు రాయితీ వేరుశనగ విత్తనాలు ప్రభుత్వం కేటాయించినట్లు ఆయన తెలిపారు. ప్రతి రైతుకు రాయితీ వేరుశనగ విత్తనాలను అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గుర్రం రమేష్, ఎంపీటీసీ మంచూరి జయరాం, ఏవో సురేష్‌బాబు, సిబ్బంది సుగుణమ్మ, మహేష్, అనుదిప్, మల్లికార్జున, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి విత్తనకాయలు పంపిణీ


గుర్రంకొండ: మండలంలోని అన్ని రైతుసేవాకేంద్రాల్లో శుక్రవారం నుంచి సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేయనున్నట్లు ఏవో రత్నమ్మ తెలిపారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీలకు నారాయణి రకం విత్తనకాయలు 570 క్వింటాళ్లు, కదిరి-6 విత్తనకాయలు 254 క్వింటాళ్లు, టీసీజీఎస్ 1,694 రకం విత్తన కాయలు 99.90 క్వింటాళ్లు మంజూరయ్యాయని తెలిపారు. నారాయణి రకం సబ్సిడీపోనూ 30కిలోల బస్తా ధర రూ. 1710 ,కే-6 రకం సబ్సిడీపోను 30 కిలోల బస్తా ధర రూ. 1674, టీసీజీఎస్ 1694 రకం సబ్సిడీపోను 30కిలోల బస్తాధర రూ. 1674 రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. విత్తనకాయలు కావాల్సిన రైతులు ఆయా రైతుసేవాకేంద్రాల్లో ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ కాపీలు తమ వెంట తీసుకెళ్లి వ్యవసాయశాఖ సిబ్బందికి అందజేయాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


మిత్ర కిట్లు సద్వినియోగం చేసుకోవాలి

గుర్రంకొండ: విద్యార్థి మిత్ర కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో సురేంద్రబాబు సూచించారు. గురువారం స్థానిక తెలుగు జెడ్పీహైస్కూల్లో విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్రకిట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈకిట్లలలో గ్రాఫ్‌పుస్తకం, నోటుపుస్తకాలు, టెక్స్‌బుక్కులు, మూడు జతల యూనిఫారంలు, ఒక బ్యాగు, డైరీ, బెల్టు మరియు ఒక జత బూట్లు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ రమేష్, ఉపాధ్యాయులు జావీద్, రాజేంద్రప్రసాద్, అరవింద్‌రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, మాలతి, ప్రశాంతి, రవినాయక్ పాల్గొన్నారు.

అమ్మమాట.. అంగన్‌వాడీ బాట

- చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం
- పిల్లల ఆరోగ్యం, పౌష్టికాహారంపై అవగాహన


మదనపల్లె రూరల్ : సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న చిన్నారులు


నిమ్మనపల్లె : చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు

మదనపల్లె రూరల్ : మూడేళ్లు నిండిన చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రవేశాలు కల్పిస్తూ..అయిదేళ్లు పూర్తిచేసుకున్న పిల్లలను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించడమే లక్ష్యంగా రండి.. అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ నాగవేణి తెలిపారు. గురువారం పట్టణంలోని ఇందిరానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించారు. పిల్లలతో ఓం బీజాక్షరాన్ని పలకల్లో రాయించారు. ఈ సందర్భంగా సీడీపీఓ నాగవేణి మాట్లాడుతూ బడి బయట ఒక్క పిల్లవాడు ఉండకూడదనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పిస్తే అటు ఆరోగ్యం..ఇటు చదువు కూడా ఉంటుందన్న విషయాన్ని తల్లులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. మూడేళ్లు దాటిన పిల్లలు ఎక్కడెక్కడ ఉన్నారో తెలుసుకుని వారిని అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకువచ్చేలా సిబ్బంది చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్వేత, అంగన్‌వాడీ కార్యకర్తలు జయలక్ష్మీ, మాధవి, చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం: అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ వారి ఆధ్వర్యంలో మండలంలోని అన్ని అంగన్‌వాడీ సెక్టార్‌లలో గురువారం పిల్లలతో సామూహిక అక్షరాభ్యాసానికి శ్రీకారం చుట్టారు. బి.కొత్తకోట ప్రాజెక్టు సీడీపీఓ భాగ్యమ్మ పలు చోట్ల పాల్గొని అక్షరాభ్యాసం ఆవశ్యకతను క్షుణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నాగరత్న, జయరాణి, భవానీలతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రామసముద్రం: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని మూడు సంవత్సరాల పిల్లలకు గురువారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-3లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిన్నారుల భవితకు పూనాది

తంబళ్లపల్లె: అంగన్‌వాడీ కేంద్రాల్లోనే చిన్నారుల భవితకు పునాది పడుతుందని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సుజాత అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. చదువుల తల్లి సరస్వతి చిత్రపటానికి పూలమాలలతో పూజలు చేశారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ మెటీరియల్ ద్వారా ఆంగ్లబోధన చేయడంతోపాటు పిల్లల ఆరోగ్యం, పౌష్టికాహారం పంపిణీ తదితర అంశాలపై వివరించారు. సూపర్‌వైజర్లు రమణమ్మ, చంద్రకాంతమ్మ, నాగలక్ష్మి, కార్యకర్తలు ఉమా, సరస్వతి, కళావతి పాల్గొన్నారు.

దిగువపల్లెలో..

నిమ్మనపల్లె : మండలంలోని ముష్టూరు పంచాయతీ దిగువపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం సూపర్‌వైజర్లు కుసుమరాణి, ధనలక్ష్మి ఆధ్వర్యంలో మూడేళ్లు పైబడిన పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. చిన్నారుల చేత ఓం అక్షరం దిద్దించారు. పూర్వ ప్రాథమిక విద్య అమలులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. చిన్నారుల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు కృషిచేయాలన్నారు. మూడేళ్లు పైబడిన చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ సుధాకర, అంగన్‌వాడీ కార్యకర్తలు గీత, పర్వీన్, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.


తంబళ్లపల్లె: పూజ చేస్తున్న సీడీపీఓ సుజాత


రామసముద్రంలో..


పెద్దతిప్పసముద్రంలో..